


# పరదేశీ కథలు

## - చిట్టే సిద్ధ లలిత



- 100 -

## గూడు మరిచిన గువ్వ

**"లచ్చిందేవీ.. కొయేటి నుంచి** జాబు వచ్చిందా అమ్మా.." చేనుకాడ్నించి తోలుకొచ్చిన ఎద్దులను కొట్టంలోని గుంజకు కట్టేస్తూ ఆరాటంగా అడిగాడు కిట్టయ్య.

"లేదు నాయనా. సంవత్సరం అయిపాయె. ప్రతిరోజూ పోస్ట్ మాన్ ను అడుగుతూనే వున్నాను. అమ్మ కాడ్నించి జాబు లేదు, ఫోను లేదు, దుడ్డూ పంపియ్యడం లేదు. అమ్మ అక్కడ కొయేట్లో ఎట్టుండాదో, ఏ కష్టం పడతాందో ఏమో? ఏ సంగతీ తెలియడం లేదు. ఫోను చేస్తే నంబర్ పని చెయ్యడం లేదు. ఒకసారి మిట్టకింది శివకు చేసి వివరం కనుక్కో నాయనా" చెప్పింది లచ్చిందేవి స్టీలు చెంబుతో నీళ్ళందిస్తూ.

అమ్మ గుర్తుకు రాగానే ఆయమ్మి మొహంలో దిగులు నీడలు కమ్ముకున్నాయి. చెంబులో నీళ్ళు గటగటా తాగి నిట్టూర్చాడు కిట్టయ్య. రేయింబగళ్ళు భార్య గురించి ఆలోచించి చిక్కి శల్యమయ్యాడు అతడు. ఏదయినా ఊహించడానికి ధైర్యం చాలడం లేదు.

"కొయేటికి పోవద్దో అంటే మీయమ్మ మనమాట వినకపాయె. ఇప్పుడు సితీ గతీ తెలియకపాయె. మన దేశం కాదు కదా పోయి ఎక్కడుండాదో వెతికి పట్టుకునేందుకు. ఎవర్ని అడిగినా మాకు తెలియదు అనే చెప్తాండారు. అక్కడ కొయేట్లో మీయమ్మ పనిచేసే సేటు ఇంటికి ఎవరూ పోయేదానికి లేదంట. సేటు కోపిష్టి అనీ మనవాళ్ళను ఎవరినీ ఇంటి దాపులకు కూడా రానివ్వడని తెలిసింది. అక్కడ చచ్చిందో బతికే వుందో సంగతి తెలియాలంటే మీయమ్మ జాబు రాయాల లేదంటే ఫోను చెయ్యాల అంతే. వేరే మార్గం లేదు" తేల్చి చెప్పాడు కిట్టయ్య.

రోజూ పొద్దున లేచినకాడ్నించీ ఇంట్లో ఇవే మాటలు. అదే చర్చ.

"వద్దంటే వినకుండా లచ్చలు సంపాదిస్తా అంటా పోయింది. ఇప్పటికి నాలుగేళ్ళయింది. పోయిన రెండేళ్ళు బాగానే జాబులు రాసింది, ఫోన్లు చేసింది.ఆ తరవాత ఏమయిందో అర్థం కావడంలేదు. ఏదో ఒకటి చేసి అమ్మ

పోవిడి కనుక్కోవాల నాయనా" ఆవేదనగా చెప్పాడు అప్పుడే కాలేజీ నుంచి ఇంటికొచ్చిన కొడుకు చంద్ర.
కళావతి నాలుగేళ్ళ క్రితం కొయేటికి పోయినప్పుడు పిల్లోళ్ళు చిన్నవాళ్ళు. ఇప్పుడు పిల్ల లచ్చిందేవి పెద్దమనిషి అయింది. పిల్లోడు చంద్ర పది పాసయి కాలేజీకి పోతున్నాడు. ఇప్పుడే గదా కుటుంబంలో అందరూ కూడుకుని ఒకచోట సంతోషంగా వుండాల. ఇంకో రెండేళ్ళు పోతే మంచి సంబంధం చూసి పిల్లకు పెళ్ళి చెయ్యాల. ఇల్లాలు లేని ఇల్లు బోసిపోయినట్లుగా వుంది. వయసొచ్చిన బిడ్డకు తల్లి తోడు అవసరం. లచ్చిందేవికి మంచి చెడ్డా చెప్పేవాళ్ళు లేరు.ఏమయిందో కళావతి?
"మీయమ్మ తిరిగి ఇంటికొస్తాదంటావా, కళ్ళతో మళ్ళీ చూస్తామంటావా చంద్రా.." ఆవేదనగా కొడుకును ప్రశ్నిస్తూ నులక మంచం మీద పడుకుని ఆలోచనలో మునిగిపోయాడు కిట్టయ్య. అతని మనోవ్యథ అంతులేనిదయింది.
"కొయేట్లో మనకు తెలిసిన వాళ్ళందరికీ ఫోన్లు చేసి నేను కనుక్కుంటాలే నాయనా. నువ్వు బాధపడగాకు" ధైర్యం చెప్పి బయటికి వెళ్ళిపోయాడు చంద్ర.
"మరీ.. ఆమధ్య వెంకటమ్మ వచ్చి అమ్మ గురించి ఏదేదో వాగింది నాయనా. తిట్టి పంపించాను. అమ్మ కొయేటికి పోయిందని మన మీద అందరికీ కుళ్ళు నాయనా. తొందరగా అమ్మ తిరిగొస్తే బావుండు. ఇక ఎక్కడికీ లేదు. అందరం వున్నకాడికి చద్దినీళ్ళు తాగి ఒకచోట బతుకుదాం" చెప్పింది లచ్చిందేవి బాధగా.
"లోకులు పలుగాకులు తల్లీ.వాళ్ళ నోళ్ళు మూయించాలి. మీ అమ్మ ఎక్కడుందో నేను కనుక్కుంటాను. నువ్వు భయపడగాకు" చెప్పాడు కిట్టయ్య.
ఆ ఇంట్లో ఈ తంతు రోజూ జరిగేదే. కానీ ఈ మధ్య అందరిలో దిగులు ఎక్కువయింది. నలుగురున్న అందమైన ఆ గూడు చెదిరిపోయిందా అనే సందేహం కలుగుతోంది.

తెలిసిన వాళ్ళందరికీ ఫోన్లు చేసి కళావతి ఎక్కడుంది, ఎలా వుంది అని విచారిస్తున్నారు. కువైట్ లో పనిచేసే ఇంటి అడ్రస్ చెప్పి వీలయితే అక్కడికి పోయి చూసి రమ్మని అర్థిస్తున్నారు. చేతనయిన అన్ని ప్రయత్నాలూ చేస్తున్నారు. ఎవరూ సరైన జవాబు ఇవ్వడం లేదు.
కువైట్ లో వున్నవాళ్ళు "అలా కువైటు సేట్ల ఇంటికి వెళ్ళడానికి వీలుకాదు. అనుమతించరు" అని చెబుతున్నారు. ఏం చెయ్యాలో అర్థం కాలేదు.
తండ్రి దిగులుతో కృశించిపోవడం చూడలేని చంద్ర "నేను కొయేటుకు పోతా నాన్నా. ఎక్కడవున్నా అమ్మను వెతికి పట్టుకుని తీసుకొస్తా" అన్నాడు ఆవేశంగా.
అది జరిగే పని కాదని వారికి తెలుసు.

లచ్చిందేవి అమ్మకు జాబులు రాస్తూనే వుంది. అందులో దీనంగా తమ మొరను విన్నవించుకుంటూనే వుంది. ఒక్కసారి ఫోను చేసి క్షేమాన్ని తెలపమని మొర పెట్టుకుంది.దేశం కాని దేశంలో అమ్మకు ఏమయిందో అనే ఆలోచనే ఆ పిల్లకు ఏడుపు తెప్పిస్తోంది. అమ్మ ప్రాణంతో వుంటే జాబు రాయకుండా వుండదు.ముఖ్యంగా తనంటే చాలా ఇష్టం. ముద్దుల కూతురంటూ గారాబం చేస్తూ కోరింది కొనిపెట్టేది. మరి ఇన్ని రోజులు మాట్లాడకుండా, చూడకుండా ఎలా వుండగలుగుతోందో? ఒకవైపు తండ్రిని చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది. ఏమీ చేయలేని నిస్సహాయతతో తండ్రికి అన్నకు కనబడకుండా చాటుగా ఏడుస్తోంది లచ్చిందేవి.

మన ఊరు కాదు, మన దేశం కాదు. ఎక్కడని వెతకాలి? ఎలా వెళ్ళాలి? వారి హృదయాల్లో తుఫాను కల్లోలం చెలరేగింది. ఆ ముగ్గురూ ఒకరి ఎదుట మరొకరు తమ దు:ఖాన్ని బయటపడనీకుండా లోనికి అణచుకుంటున్నారు. ఒకరినొకరు ఓదార్చుకుంటూ ధైర్యం చెప్పుకుంటున్నారు. కానీ బయటివాళ్ళు ఊరికే వుండరు కదా. అమ్మలక్కలు కళావతి ఎలా వుంది, ఎప్పుడొస్తోంది అని అడుగుతూ రకరకాలుగా మాట్లాడుకుంటున్నారు.

ఎంత వద్దన్నా ఏదో ఒక మాట చెవిన పడుతూనే వుంది.వాటిలో నిజమెంతో, అబద్ధమెంతో దేవునికే తెలియాలి. నిజం కాదని, కళావతి అలాంటిది కాదని వాదిస్తూ కొందరితో కొట్లాడారు కూడా. సత్యం జీర్ణం చేసుకోవడానికి వీళ్ళు సిద్ధంగా లేరు. కిట్టయ్య అయితే అగ్ని పర్వతంలాంటి ఆవేశంతో లోపల్లోపల రగిలిపోతున్నాడు. కొన్నిరోజులకు ఊళ్ళో వాళ్ళందరూ తమను చూసి నవ్వుకుంటున్నారనే భ్రమ వారికి కలిగింది. కానీ ఎవరికి వారే బయట పడకుండా నిండుకుండలా తొణకుండా వున్నారు.

ఒకరోజు బాయికాడ వెంకటమ్మ వచ్చి

"ఓమ్మీ లచ్చిందేవీ ఇది విన్నావా.. నిన్న మన వెంకట్ రాజంపేటకు పోతే.. మీ అమ్మ కరీం బాషాతో కలిసి రాజం పేట సినిమా హాల్లో కనబడిందంట. తొందరగా పోయి వెతకండి" అని చెప్పింది.

లచ్చిందేవికి పిచ్చి కోపం వచ్చింది. "నువ్వు ఆ వెంకట్ గాడు ఎవర్ని చూసి ఎవరనుకుంటున్నారో. మా అమ్మను గురించి ఏమనుకుంటున్నావ్ నువ్వు. మా అమ్మ నిప్పులాంటిది. అలా చెడుగా అనుకుంటే నీ కళ్ళు పోతాయ్. మరొకసారి మా ఇంటికొచ్చి ఇలాంటి మాటలు చెప్పకు. మా నాయనకు తెలిస్తే నిన్ను చంపేస్తాడు" అంటూ గద్దిపెట్టింది లచ్చిందేవి.

"సరేనమ్మా.. మాకెందుకు. ఏదో ఉన్నది విన్నది చెప్పాను. తరవాత మీ ఇష్టం" అంటూ నిష్టూరంగా మాట్లాడి వెళ్ళిపోయింది వెంకటమ్మ.

ఆమే కాదు మరో ఇద్దరు ముగ్గురు నీళ్ళకాడ, చేనుకాడ కళావతి గురించి వ్యంగ్యంగా ఎగతాళి చేస్తూ మాట్లాడారు. కోపాన్ని అణచుకోలేక మథన పడుతున్నారు ఈ ముగ్గురూ.

"దేవుడా తిరుపతి వెంకటేశ్వరా.. మా అమ్మ తిరిగి ఇంటికి వచ్చేలా వీళ్ళందరి నోళ్ళూ మూత పడేలా మేము తలెత్తుకుని తిరిగేలా చూడు స్వామీ.. కాలినడకన నీ కొండకు వస్తాము" అంటూ దండం పెట్టుకుంది లచ్చిందేవి.

కానీ ఎన్నాళ్ళలా.. ఏదో ఒకనాడు అగ్ని పర్వతం బద్దలవక తప్పదు. లావా ప్రవహించక తీరదు.

ఒకరోజు ఉదయాన్నే ఇద్దరు మనుషులొచ్చి కిట్టయ్యను బయటికి తీసుకపోయినారు. మధ్యాహ్నం భోజనానికి కూడా అతడు ఇంటికి రాలేదు.

లచ్చిందేవికి కుడికన్ను అదురుతూ వుంది. అన్నం కూడా తినకుండా కూర్చుంది. చంద్ర కాలుగాలిన పిల్లిలా ఇంట్లోకి బయటికి తిరుగుతున్నాడు. నాయన ఎక్కడికి పోయినాడో వాడికి అర్థం కాలేదు. ఏదో భయం వారి హృదయాల్లో నిండుకుని కలవరపెడుతోంది.

వాళ్ళింకా లోకం తెలియని పసివాళ్ళు. ఏ అలికిడి అయినా నాయన ఇంటికి వచ్చాడేమో అని ఆదుర్ధాగా వాకిలి వైపు చూస్తూ ఆ రాత్రంతా కంటిమీద కునుకు లేకుండా గడిపారు. తెల్లారేటప్పటికి ఊరంతా ఒక వార్త గుప్పుమంది. కల్లోలం చెలరేగింది. మనుషులు గుంపులు గుంపులుగా నిలబడి "ఘోరం జరిగిపోయింది. కిట్టయ్యకు లాడ్జిలో దొరికినారంట. తాళి కట్టి సంసారం చేసిన మొగుడు కళ్ళతో చూసి ఎలా సహిస్తాడు. కొడవలి బాగా నూరుకుని తీసుకపోయినాడు. తెగ నరికాడు" అంటూ మాట్లాడుకుంటున్నారు.

కిట్టయ్య ఇంటికాడ ఒక గుంపు చేరింది. చుట్టుపక్కల అమ్మలక్కలు వచ్చి విషయాన్ని వివరించి చెప్పసాగారు. కొందరు న్యూస్ పేపర్ తీసుకొచ్చి అందులోని వార్తను చదివి వినిపించారు. వారి మాటలు వినలేక లచ్చిందేవి గొల్లుమని ఏడ్చింది. శోష వచ్చి పడిపోయింది. ఆయమ్మిని ఎవరూ ఓదార్చలేక పోయారు.

"నాల్రోజుల క్రితమే కువైట్ నుండి వచ్చిన కరీం భాషాను, భార్య కళావతిని రాజంపేట లాడ్జిలో చూసి వారిని తెగనరికి తలకాయలతో సహా పోలీస్ స్టేషన్ కు వెళ్ళి లొంగిపోయిన కిట్టయ్య. "

న్యూస్ పేపర్లోని ఈ వార్తను చదివిన చంద్ర నిలువునా కూలబడిపోయాడు. పచ్చని చెట్టులా కళకళలాడాల్సిన కుటుంబం మ్రోడులా మిగిలింది. పాపం పిల్లలు దిక్కులేని వారయ్యారు. అవమానాన్ని మోస్తూ బాధను భరిస్తూ, తల్లిదండ్రులు లేని అనాధల్లా జీవితాన్ని గడిపే విధి వంచితులయ్యారు వారు.

*(మరోకథ వచ్చేనెలలో)*

Post your comments